# స్వర్గలోకపు సెలయేళ్ళు

**అంశం : 165**

**స్వర్గంలోని ఒక సెలయేరు పేరు 'సల్‌సబీల్'. దాని నుంచి శొంఠి కలిసిన మద్యం వెలువడుతుంది.**

"వారి మధ్య వెండి పాత్రలు, గాజు గ్లాసులు అటూ ఇటూ తిప్పబడుతూ ఉంటాయి; ఆ గాజు గ్లాసులు స్ఫటికం వలె తెల్లనైన వెండితో చేయబడినటువంటివి. వాటిని (స్వర్గ నిర్వాహకులు) ఖచ్చితమైన అంచనా ప్రకారం నింపి ఉంటారు. అక్కడ వారికి శొంఠి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడతాయి; ఇది స్వర్గం లోని 'సల్‌సబీల్ అనే పేరు గల ఒక సెలయేరు." (ఖుర్‌ఆన్, దహ్ర్: 15-18)

**అంశం : 166**

**స్వర్గంలోని ఒక సెలయేరు పేరు 'కాఫూర్'. దాని మద్యాన్ని స్వర్గవాసులు ఆస్వాదిస్తారు.**

"సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు; ఇది ప్రవహించే ఒక సెలయేరు; దైవదాసులు దాని నీటితో పాటు మద్యం సేవిస్తారు. వారు తాము కోరిన చోటికి దాని పాయలను సులభంగా తీసుకుపోతారు."

(ఖుర్‌ఆన్, దహ్ర్: 5-6)

**అంశం : 167**

**స్వర్గంలోని ఒక సెలయేరు పేరు 'తస్‌నీమ్'. దాని స్వచ్ఛమైన నీరు కేవలం అల్లాహ్ సాన్నిధ్యం పొందిన వారికి మాత్రమే ఇవ్వబడుతుంది.**

**అంశం : 168**

**సజ్జనులకు ఉత్తమమైన మద్యంలో 'తస్‌నీమ్' సెలయేటి నీటిని కలిపి తాగేందుకు ఇవ్వబడుతుంది.**

"నిస్సందేహంగా సజ్జనులు సుఖసంతోషాలలో తేలియాడుతూ ఉంటారు, ఉన్నత పీఠాలపై కూర్చుండి (స్వర్గ దృశ్యాలను) తిలకిస్తూ ఉంటారు. వారి ముఖాలలో నీకు సుఖసంతోషాల కళాకాంతులు కనిపిస్తాయి. ముద్ర వేయబడిన, సుమధుర మధువు వారికి ఇవ్వబడుతుంది. దానిపై కస్తూరి ముద్ర వేయబడి ఉంటుంది. ఇతరుల్ని మించిపోవడానికి కృషి చేయాలి. ఆ మధువులో 'తస్నీమ్' కలిసి ఉంటుంది. ఇదొక సెలయేరు, దీని జలంతో పాటు దైవసాన్నిధ్యం పొందినవారు మధువు సేవిస్తారు" (ఖుర్‌ఆన్, ముతఫ్ఫిఫీన్ : 22-28)

## అంశం : 169

**కొన్ని సెలయేళ్ళ నుంచి తెల్లని, కాంతివంతమైన, రుచికరమైన మద్యం వెలువడుతుంది.**

"వారి కొరకు అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది, రుచికరమైన అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి, భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యానవనాలు ఉన్నాయి, అందు వారు సగౌరవంగా ఉంచబడతారు. సోఫాలపై ఎదురెదురుగా కూర్చుంటారు. మద్యపు చెలమల నుండి పాత్రలు మాటి మాటికీ నింపబడి వారి మధ్య తిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు, తాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికీ నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు." (ఖుర్ఆన్, సాప్ఫాత్ : 41-45)

## అంశం : 170

**కొన్ని సెలయేళ్ళు జలపాతాల వలె ఉప్పొంగుతూ ఉంటాయి.**

"ఆ రెండు తోటలలోనూ రెండు చెలమలు పొంగి పొరలుతూ ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?" (ఖుర్ఆన్, రహ్మాన్: 66-67)

## అంశం : 171

**స్వర్గవాసుల హృదయానికి, కళ్ళకు చల్లదనం చేకూర్చేందుకై సెలయేళ్ళు, జలపాతాలు కూడా ఉంటాయి.**

"అందులో సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి." (ఖుర్ఆన్, గాషియహ్: 12)

"(స్వర్గంలో) దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు ఉంటాయి." (ఖుర్ఆన్, వాఖిఅహ్: 30-31)

## అంశం : 172

**పైన పేర్కొనబడిన సెలయేళ్ళే కాకుండా స్వర్గవాసుల ఆతిథ్యం కొరకు ఎన్నోచోట్ల వివిధ సెలయేళ్ళు ఉంటాయి.**

"దైవభీతి గలవారు శాంతి భద్రతలు గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యానవాలలో, సెలయేళ్ళలో ఉంటారు." (ఖుర్ఆన్, దుఖాన్ : 51-52)

"దైవభీతి కలవారు ఈ రోజున నీడల క్రింద సెలయేళ్ళ మధ్య ఉన్నారు. వారు ఏ పండ్లు కోరినా (అవి వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి)." (ఖుర్ఆన్, ముర్సలాత్: 41-42)